క్లుప్తంగా

చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



చారిటబుల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో భాస్కర్‌కృష్ణ చారిటబుల్ ట్రస్ట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన విద్యార్థులకు ఉన్నత విద్యనందించడానికి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన నల్లమిల్లి లక్ష్మి(ఆడిటర్), సురేష్‌రెడ్డిలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం చారిటబుల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నిదానాల్లోకి విద్యా దానం చాలా గొప్పదన్నారు. ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ తమ సేవలందించేందుకు ప్రణాళికలు రచించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మ రెడ్డి, సబ్బెళ్ల రామలక్ష్మణులు, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, మండ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న నిర్వాహకులు

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలో ద్విభాష్యం గోపికి చెందిన పామాయిల్ తోటలో మంగళవారం శ్రీదాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ విగ్రహ ప్రతిష్ఠ ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు సూర్యనారాయణవర్మ (రవివర్మ) చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, నవగ్రహ ఆరాధన తదితర పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ద్విభాష్యం సూర్యవెంకటసుబ్బారావు శర్మ, ద్విభాష్యం రవికిరణ్‌శర్మ, స్థానిక నాయకులు మంగరౌతు రామకృష్ణ, ఎస్‌డి శ్రీనివాస్, బుద్ధరాజు సుబ్బరాజు, గాజింగం రామలింగేశ్వరరావు, అమరా దొర తదితరులు పాల్గొన్నారు.

జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు



పందలపాకలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో రాజరాజేశ్వరీ ఆలయం వద్ద జమ్మి చెట్టుకు గరిమెళ్ళ గాంధీ పంతులు ఆధ్వర్యంలో కర్రి బులివెంకటరెడ్డి, దేవిశాంతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, కర్రి ఇన్రారెడ్డి, పడాల వెంకటరెడ్డి, జగారపు జగదీష్, గొలుగూరి వెంకటరామారెడ్డి, గొలుగూరి చంద్రారెడ్డి, పడాల సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బాధ్యత' వార్షికోత్సవం

కడియం: బాధ్యత సేవా సంస్థ 15వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) తెలిపారు. ఈ మేరకు ఆయన కడియంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్ ఆవరణలో నిర్మించిన గిరజాల కృష్ణారావు కళావేదిక ప్రారంభిస్తామన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, విశిష్ఠ సత్కారాలు, ప్రముఖులకు పురస్కారాలు అందజేస్తామన్నారు. దీనికి జిల్లా నలుమూలల నుంచి రాజకీయ ప్రముఖులు హాజరవుతారన్నారు.

1 నుంచి సీపీఐ జనం బాట

ప్రకాశంనగర్: వచ్చే నెల 1 నుంచి 15 వరకూ సీపీఐ జనం బాట నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా సమావేశం జరిగింది. దీనికి మధు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై 15 రోజుల పాటు ప్రతి వార్డులో జనం బాట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం మల్లికార్జుననగర్‌లో వాటర్ ట్యాంకులు మెడికల్ కళాశాల రోడ్డులో సారా విక్రయిస్తున్న యరక గణేష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతని నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

చుక్కపై ఉక్కుపాదం

- మెట్టలో సారాకు అడ్డుకట్ట
- గ్రామాల్లో ఎక్సైజ్, పోలీస్ శాఖల విస్తృత దాడులు



పలు కేసుల్లో పట్టుబడిన సారా, అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో సారా తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఒకప్పుడు ఇక్కడ పొలాలకు నీటి ×చుక్క కరవు అవ్వొచ్చు కాని తాగడానికి సారా ×చుక్కకు మాత్రం లోటుండేది కాదు. దశాబ్దాలుగా మండలంలోని అనేక గ్రామాల్లో అక్రమార్జనకు అలవాటుపడిన కొందరు తోటలు, కాలువ గట్లపై సారా బట్టీలను నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేవారు. అయితే ఇటీవలి కాలంలో ఎక్సైజ్, పోలీస్ శాఖలు సంయుక్తంగా కలిసి సారా బట్టీలు నిర్వహిస్తున్న వారిపై విస్తృతంగా దాడులు చేస్తూ సారా విక్రయాలను కూకటివేళ్లతో పెకిలించేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నారు.

రంగంపేట మండలంలోని ఏ మూలకు వెళ్లినా సారా తయారీ కంపు గుప్పుమనేది. రహస్య ప్రదేశాల్లో సారా తయారు చేసి రాత్రికి రాత్రే బైక్‌లపై, ఆటోల్లోనూ చుట్టుపక్కల ఎన్నో గ్రామాలకు ఎగుమతి చేసేవారు. పోలీసులు అడపాదడపా కొందరిపై కేసులు పెట్టినా మళ్లీ షరా మామూలే అన్నట్లుగా వ్యవహారం సాగేది. అయితే ఇటీవల పోలీసులు తమ నెట్‌వర్క్ ద్వారా గ్రామాల్లో ఎక్కడెక్కడ సారా తయారీ సాగుతుందో తెలుసుకుని ఆకస్మిక దాడులకు పాల్పడుతున్నారు. దీంతో సారా తయారీ, విక్రయదారులకు కంటి మీద కునుకు లేకుండాపోతుంది. ప్రధానంగా సారా తయారీబట్టీలపై దాడులు చేసి అక్కడ బెల్లపు ఊట ధ్వంసం చేయడమే కాకుండా వారికి సహకరిస్తున్నవారిపై సైతం కేసులు నమోదుచేసి కోర్టుకు తరలిస్తున్నారు. అంతేకాదు ఎవరైనా రెండు, మూడుసార్లు పట్టుబడితే వారిపై నేరుగా పీడీ యాక్టు అమలుచేస్తున్నారు. దీంతో గత కొంతకాలంగా సారా తయారీ, విక్రయదారుల్లో గుబులు మొదలైంది. ఎస్ఈబీ అధికారులు ప్రధానంగా మండలంలోని ఈలకొలను, జి.దొంతమూరు, ముకుందవరం తదితర గ్రామాల్లో తరచూ బట్టీలను ధ్వంసం చేస్తున్నారు. తాజాగా సెబ్ స్టేషన్ అధికారులు మండలంలోని పలు గ్రామాల్లో 16 సారా కేసుల్లో పట్టుబడిన 1889 లీటర్ల సారా, 8 కేసుల్లో పట్టుబడిన 44 అక్రమ మద్యం బాటిళ్లలోని మద్యాన్ని స్థానిక సెబ్‌స్టేషన్ వద్ద ధ్వంసం చేశారు.

పదే పదే పట్టుబడితే పీడీ యాక్టు



"సారా తయారీ, విక్రయాలు జరగకుండా నిత్యం దాడులు నిర్వహిస్తున్నాం. విక్రయాలు జరగకుండా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. సారాతో పట్టుబడిన వారిపైన, వారికి సరఫరా చేసిన వ్యక్తులపైనా కేసులు నమోదుచేసి కోర్టుకు తరలిస్తున్నాం. రెండు, మూడు సార్లు పట్టుబడితే పీడీ యాక్టు నమోదు చేస్తున్నాం."

– జి.వెంకటలక్ష్మి, ఎస్ఈబీ సీఐ, రంగంపేట

వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సంపరలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి జగన్ రెండోసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సంపరలో ఆదివారం రాత్రి నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో జగన్‌కు ప్రజల నుంచి రోజురోజుకూ మరింత ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రజలంతా మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, దిమ్మల బుజ్జిబాబు, నాగుమళ్ల వీరభద్రరావు, సర్పంచ్‌లు డోకుబుర్ర మీనాక్షి, వల్లు వెంకటరమణ, ప్రమీల పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట



బిక్కవోలులో కళావేదిక శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: గ్రామాల్లో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మెళ్లూరు, బిక్కవోలు శెట్టిబలిజిపేట, కాపవరం ఎస్సీ ఏరియాల్లో ఎంపీ నిధులతో నిర్మించనున్న కళావేదికలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలప్పుడే రాజకీయాలను చూస్తామని, ఇతర సమయమంతా తాము అభివృద్ధిపైనే దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. 2024లో ఎన్నికల్లో జగన్ నాయకత్వంలోని సంక్షేమ, అభివృద్ధి ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సర్పంచ్ సరెళ్ల సుమలత, సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ కొమ్మన ఆనంద్, బొడ్డు ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబాకు పూజలు



రాజానగరం సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో బాబావారి సమాధి ఉత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విజయ దశమి పర్వదినాన బాబా సమాధి కావడంతో ఆలయంలో బాబా ముంగిట పుష్పాలతో సమాధి నమూనాను ఏర్పాటు చేసి, 'ఓం సాయి, శ్రీసాయి, జయజయ సాయి' అనే సాయి నామస్మరణతో పుష్పాంజలి ఘటించారు. వేకువజామున కాకడ హారతి అనంతరం గురుచరిత్ర పారాయణ చేశారు. మధ్యాహ్నం హారతి తరువాత సమాధి ఉత్సవాన్ని నిర్వహించి, అన్న సమారాధన చేశారు. ఇదిలా ఉండగా సాయిబాబా సన్నిధిలో కొలువైన సరస్వతీ మాత విగ్రహం వద్ద దసరా తొమ్మిది రోజులూ కుంకుమార్చనలు జరిగాయి.

మధురపూడి: కాపవరం సెంటర్‌లోని రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో మంగళవారం దసరా ఉత్సవాల ముగింపు వేడుకలు జరిగాయి. ఈ ఉత్సవాలను వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జి ప్రారంభించారు. ముగింపు వేడుకల్లో విద్యార్థినుల భరతనాట్యం ప్రదర్శన ఆకట్టుకుంది. కోరుకొండ, కాపవరం గ్రామాలకు చెందిన విద్యార్థినులు భరతనాట్యం చేశారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ జరిగింది. కార్యక్రమంలో దేవీ వెంకట మణిసాయి మోటార్ మెకానికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పి.రమణ, ఉపాధ్యక్షుడు ఎన్.సత్తిబాబు, సభ్యులు కనుబొజ్జి సూర్యచంద్రం, జె. సాయిబాబా, కాలచర్ల శ్రీను పాల్గొన్నారు.

గాడాల పీఠంలో దుర్గా హోమం

గాడాలలోని మహాలక్ష్మీ సమేత చినవేంకటేశ్వర స్వామి పీఠంలో దుర్గా హోమం జరిగింది. మూడు రోజుల పాటు పూజలు నిర్వహించారు. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా పీఠాధిపతి చినవెంకన్న బాబు ఆధ్వర్యంలో దుర్గామాత హోమాలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఈ హోమాలు జరిగాయి. రాజమహేంద్రవరం, కోరుకొండ మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పీఠం ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్మన్ మథల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హీరో ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు

పెదపూడి: మండలంలోని పుట్టకొండలో సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు స్థానిక ప్రభాస్ ఫ్యాన్స్, యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సర్పంచ్ వల్లు వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు పరిశ్రమకు చెందిన ప్రభాస్ వరుసగా పాన్ ఇండియా సినిమాలు చేయడం గర్వకారణమన్నారు.

నేడు పెంటపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

గోకవరం: పెంటపల్లి గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

విహారంలో విషాదం

ఒకరి మృతి

గూడెంకొత్తవీధి (అల్లూరి సీతారామరాజు జిల్లా): పర్యాటకుల వాహనం ప్రమాదానికి గురవడంతో విహార యాత్ర విషాదంగా మారింది. రాజమహేంద్రవరానికి చెందిన వేమన సాయితేజ కుటుంబ సభ్యులు పాడేరు డివిజన్‌లో పర్యాటక ప్రాంతాల సందర్శనకు సోమవారం ప్రత్యేక వాహనంలో వచ్చారు. అరకు, జి.మాడుగుల ప్రాంతాల్లో ప్రకృతి అందాలను తిలకించారు. అనంతరం బూదరాళ్ల రహదారిలో రాజమహేంద్రవరం బయలుదేరారు. బొంతువలస సమీపంలోని మలుపు వద్దకు వచ్చే సరికి వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న సాయితేజ (22) మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించామని ఎస్ఐ అప్పలసూరి తెలిపారు.

మధుర గాయకుడు మన్నాడే



మన్నాడే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ హిందీ గాయకుడు మన్నాడే వర్ధంతిని స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదిక వద్ద మంగళవారం నిర్వహించారు. దీనికి నటుడు, గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్ మోహన్‌మిత్ర అధ్యక్షత వహించగా ముద్రగడ ఏసుబాబు జ్యోతిని వెలిగించారు. జిత్‌మోహన్ మిత్ర మాట్లాడుతూ మన్నాడే తన మధుర గానంతో పలు చిత్రాల్లో పాటలు పాడి సంగీత ప్రేమికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. డాక్టర్ గిరజాల సోమరాజునాయుడు మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత పరమైన పాటలకు మన్నాడే పెట్టింది పేరని కొనియాడారు. బి.సీతారామారావు మాట్లాడుతూ మన్నాడే ఒక్క హిందీలోనే కాకుండా దాదాపు 13 భాషల్లో గాయకుడిగా రాణించారన్నారు. సినీ విశ్లేషకుడు అడబాల మరిడియ్య, శ్రీమిత్ర, డాక్టర్ వంకా బాలకృష్ణ, టీవీ శేషగిరి, వి.జగపతి, కృష్ణారావు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మృతి చెందిన అరుణ



సంఘటనా స్థలంలో విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రాజానగరం: మృత్యువు ట్రాక్టర్ రూపంలో ఆమెను కబళించింది. అక్కాచెల్లెళ్ల బంధాన్ని విడదీసింది.. దైవ దర్శనం చేసుకుని ఆనందంగా స్కూటీపై ఇంటికి వస్తున్న అక్కాచెల్లెళ్లలో అక్క మీసాల అరుణ (26) అక్కడికక్కడే మృతి చెందగా.. చెల్లెలు పప్పు శ్రీవిద్య తీవ్రంగా గాయపడింది. రంగంపేట మండలం వెంకన్నపేటకు సమీపంలో ఏడీబీ రోడ్డుపై మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఎస్టీ రాజాపురానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పప్పు వెంకటేశ్వరరావు కుమార్తెలైన ఈ అక్కాచెల్లెళ్లు ఇద్దరూ స్కూటీపై రాజమహేంద్రవరంలోని ఇస్కాన్ టెంపుల్‌కు వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. కొద్దిసేపటిలో ఇంటికి చేరుకోవాల్సిన వారిలో అరుణ మృతి చెందగా శ్రీవిద్య గాయాలతో ఆస్పత్రిలో చేరారు. ముందు వెళ్తున్న ట్రాక్టరును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా కారు రావడంతో కంగారు పడ్డారు. దీంతో స్కూటీ అదుపుతప్పి ట్రాక్టరు వెనుక ట్రక్కు కింద పడటం, పై నుంచి చక్రాలు వెళ్లడంతో అరుణ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన శ్రీవిద్యను వెంటనే 108 వాహనంలో జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. శ్రీవిద్య గ్రామ వలంటీర్‌గా పనిచేస్తుంది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సరిహద్దు సమస్యతో..

రాజానగరం నుంచి కాకినాడకు ఉన్న ఏడీబీ రోడ్డుపై 'సాక్షి' ముద్రణా కార్యాలయం వరకూ రాజానగరం పోలీసు స్టేషన్, ఆపై వెంకన్నపేట–ఎస్టీ రాజాపురం నుంచి రంగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. ఈ ప్రమాదం సరిగ్గా సెంటర్ పాయింట్‌లో జరగడంతో కొద్దిసేపు రెండు పోలీసు స్టేషన్ల సిబ్బంది నడుమ సరిహద్దు సమస్య ఎదురైంది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందన లేకపోవడంతో రోడ్డుపై ఇరువైపులా ట్రాఫిక్ జామ్ అయ్యింది. చివరకు రాజానగరం పోలీసులు తమ పరిధిగా గుర్తించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. 'యు' ఆకారంలో మలుపు తిరిగి ఉండే ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అశ్లీల నృత్యాలు నిర్వహించినందుకు కేసు

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో దేవీ నవరాత్రులు పురస్కరించుకుని అశ్లీల నృత్యాలు నిర్వహించిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి దేవీ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమంలో అశ్లీల నృత్యాలు ప్రదర్శించినట్లు సామాజిక మాధ్యమాల్లో రావడంతో వారిపై కేసు నమోదు చేశామన్నారు.

బూరుగుపూడిలో ఉపవాస ప్రార్థనలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి గ్లోరీ పెంతుకోస్తు చర్చిలో మంగళవారం ఉపవాస ప్రార్థనలు జరిగాయి. రెవరెండ్ పాస్టర్ శామ్యూల్‌రాజు వాక్య సందేశం ఇచ్చారు. ఉదయం రెవరెండ్ ప్రసాద్‌బాబు మాట్లాడారు. పాస్టర్స్ ఫెలోషిప్ కోరుకొండ మండలం అధ్యక్షుడు, రెవరెండ్ పాస్టర్ కె. నవీన్‌పాల్ ఆధ్వర్యంలో 3 రోజుల నిర్వహించే ఈ ప్రార్థనలు 25 వతేదీతో ముగియనున్నాయి.

రాజరాజేశ్వరి.. నమోస్తుతే..



గోకవరం దేవీచౌక్‌లో రాజరాజేశ్వరీదేవి అవతారంలో కనకదుర్గమ్మ



వీరభద్రునిగడ్డలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



సంపరలో ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మవారు



రంగంపేటలో మహిషాసురమర్దిని అలంకరణలో ఉమామహేశ్వరిదేవి



చంద్రేడులో మహిషాసురమర్దినిగా కాత్యాయనీదేవి

- వైభవంగా ముగిసిన విజయ దశమి వేడుకలు
- ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో భక్తుల పూజలు

అనపర్తి: శరన్నవరాత్రుల్లో చివరి రోజైన మంగళవారం విజయదశమి వేడుకలను మండల వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజామునుండే భక్తులు అమ్మవారి ఆలయాలకు, అమ్మవారిని కొలువుదీర్చిన మండపాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పొలమూరు దేవీ సెంటర్‌లోని అమ్మవారి ఆలయాల వద్ద బాలికలను అమ్మవారి ప్రతిరూపంగా భావిస్తూ కన్నెపిల్లల పూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని బాలికలను ఆశీర్వదించారు. స్థానిక వీరుళ్లమ్మ ఆలయ ప్రాంగణంలోని ఓంశక్తి సత్సంగం ఆధ్వర్యంలో త్రిశక్తి పీఠంలో అమ్మవారికి సోమవారం రాత్రి పడిపూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి బ్రదర్స్, కర్రి నాగేశ్వరరెడ్డి, గొలుగూరి మూలారెడ్డి, కొవ్వూరి శేషారెడ్డి, కర్రి వెంకటరెడ్డి, మల్లిడి గోవిందరెడ్డి, మేడపాటి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: మండలంలోని పెద్దాడలో కొలువైన దుర్గామాత అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా 108 మంది కన్యకలతో దీపోత్సవం నిర్వహించారు. గ్రామంలో అమ్మవారిని ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, వాసంశెట్టి శివ, ముల్లి రమణ, చిన్న బాబు, గోవిందు తదితరులు పాల్గొన్నారు. సంపరలో విజయదుర్గ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొమరిపాలెంలో వేలంలో గెలుచుకున్న లడ్డూను తీసుకెళుతున్న మెహెర్ శ్రీఅమూల్య

రాజరాజేశ్వరీదేవిగా కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలోని కనకదుర్గమ్మ మంగళవారం రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారికి అలంకార పూజలు చేశారు. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి నివేదించిన లడ్డూ, భక్తులు సమర్పించిన చీరలకు వేలం నిర్వహించారు. వీరభద్రునిగడ్డలోని కనకదుర్గమ్మ చివరి రోజు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు నాగేంద్రశర్మ అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. చంద్రేడులో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో చివరి రోజు అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చి అభిషేకాలను తిలకించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. స్థానిక కనకదుర్గ ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బిక్కవోలు: కొమరిపాలెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన 22 కేజీల లడ్డూకు వేలం నిర్వహించగా ఎంపీటీసీ దంపతులు బొబ్బిలి గంగాభవాని, శ్రీనివాస్ దంపతుల కుమార్తె మెహెర్ శ్రీఅమూల్య రూ.22,100కు కైవసం చేసుకున్నారు. అనంతరం రోజూ కుంకుమ పూజలు చేస్తున్న భక్తులకు లాటరీ నిర్వహించి విజేతలకు చీరలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సత్యనారాయణరెడ్డి, మల్లిడి పెద్దిరెడ్డి, మంగయ్యమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ జామి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పందలపాక వెలమపేట రామాలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.